క్లుప్తంగా

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్, జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కడప డీపీటీఓ కార్యాలయంలో ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఓం శాంతి సంస్థ ద్వారా మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ డ్రైవింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఒకవైపు ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో డ్రైవర్లు వడదెబ్బ బారిన పడకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకుని ఆ ద్రావణాన్ని తీసుకుంటూ ఉండాలన్నారు. మైదుకూరు డీఎం రామకుమార్ మాట్లాడుతూ ఇంధన పొదుపుపై పంచసూత్రాలను వివరించారు. అనంతరం డ్రైవర్లకు బ్లాక్ స్పాట్‌పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో స్పాట్‌లోకి తీసుకెళ్లి ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓం శాంతి సంస్థ అక్కయ్యలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని పలు కూడళ్లలో ఉంటున్న అనాథలు, అభాగ్యులకు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. నగరవాసి టి.ఉదయభాస్కర్.. గడ్డం నాగేశ్వర రెడ్డి తల్లి సంస్మరణగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయ భాస్కర్ మాట్లాడుతూ తన చేతుల మీదుగా పేదలకు అన్నదానం చేయడం సంతోషదాయకంగా ఉందన్నారు.

– కడప నగరంలోని విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉంటున్న అనాథ బాలికలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మితులసి క్వాలిటీ ఫ్యూయల్స్ వ్యవస్థాపకులు సింగం పార్థసారథిరెడ్డి, లక్ష్మిదేవిల వర్ధంతిని పురస్కరించుకుని ఆ సంస్థ యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషలో విద్యాబోధనతోనే వికాసం

కడప ఎడ్యుకేషన్: ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు మాతృభాషా మాధ్యమంలో విద్యాబోధన చేస్తే వారి సర్వతోముఖ వికాసం అవుతుందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వు 21 లో తొమ్మిది రకాల పాఠశాలల గురించి చెప్పారే గాని ఏ పాఠశాలలో కూడా తెలుగు మాధ్యమం గురించి ప్రస్తావనేలేదన్నారు. తెలుగు భాష మనుగడలో ఉండాలన్నా , ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు నాణ్యత గల విద్యను అభ్యసించాలన్నా తెలుగు మాధ్యమం తప్పనిసరి అని ఆయన చెప్పారు.

ఎరువుల సరఫరాలో డీలర్ల పాత్ర కీలకం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎరువులు, విత్తనాలు సరఫరాలో డీలర్ల పాత్ర ఎంతో కీలకమని తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తూనికల కొలతల శాఖ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ లీగల్ మెట్రాలజీ చట్టం, రూల్స్ పై అవగాహన కలిగి ఉండాలని, అందరూ విధిగా ఈ రూల్స్ పాటించాలని, ఎరువులు డెలివరీ చేసేటప్పుడు తూకం సరిగా ఉందో లేదో చూసి డెలివరీ చేయాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబ తిరునాల చివరి రోజు శుక్రవారం వసంతోత్సవం వేడుకను స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి పల్లకి ఇళ్ల వద్దకు రాగానే మహిళలు అమ్మవారికి కాయా, కర్పూరాలు సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఊరేగింపు వెంబడి మహిళలు, యువకులు పిల్లలు, పెద్దలు ఒకరిపై ఒకరు వసంతాలు చల్లుకుంటూ ఉల్లాసంగా పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజా అవరోహనంతో బ్రహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. స్వాములకు అభిషేకం, సహస్రనామార్చన, ఆకుపూజ, కుంకుమార్చనా, మహా మంగళహారతి వంటి పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, భక్తులు స్వాములను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీ కన్యకాంబ... నమో నమః

- శ్రీ విధుశేఖర భారతీస్వామిచే పూజలు
- వైభవంగా కన్యకాంబ గ్రామోత్సవం
- ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీ కన్యకాంబ



మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న స్వామీజీ

కడప కల్చరల్ : ఆ దేవాలయ ప్రాంగణమంతా భక్తులతో సందడిగా మారింది. శ్రీ కన్యకాంబ గ్రామోత్సవాన్ని అర్చకులు వైభవోతంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ప్రత్యేకంగా హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా స్వామీజీని చూసేందుకు వచ్చిన భక్తులతోపాటు ఆయా కార్యక్రమాలలో పాల్గొని తరించేందుకు విచ్చేసిన భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రాతఃకాల పూజ నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో శతచండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులతో కుమారి సువాసిని పూజను సందడిగా చేసి కలశోద్వాసన నిర్వహించారు. అనంతరం శ్రీ విధుశేఖర భారతీ స్వామి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు, భక్తప్రముఖులు కార్యక్రమ నిర్వాహకులు, ఆలయ కమిటీల ప్రతినిధులు ఆలయ మహాకుంభ అభిషేకానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చకులు పూజలు నిర్వహించారు. వారి మంత్రోచ్చాటనలతో ఆ వీధులు ప్రతిధ్వనించాయి. అనంతరం స్వామీజీ ఆధ్వర్యంలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆ ప్రాంతంలోని నాలుగు వైపుల భారీ ఎత్తున అన్నదానానికి ఏర్పాట్లు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఆలయం నుంచి ఊరేగింపుగా ప్రత్యేక అలంకారం చేసి గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. అమ్మవారి పూజోత్సవాల కోసం భక్తులు భారీ సంఖ్యలో కార్యక్రమాలకు హాజరయ్యారు. ఒక దశలో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. అమ్మవారి భక్తులు జయజయ ధ్వానాలు చేస్తుండగా మహిళా భక్తులు ప్రత్యేకంగా మొక్కులు చెప్పుకుంటూ ఉండగా వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పూజలు పూర్తయిన అనంతరం మహా మంగళహారతి, వేద స్వస్తి నిర్వహించనున్నారు.

చంద్రమౌళీశ్వర పూజ

ఈ సందర్భంగా శ్రీ విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మఠం అర్చకులచే శ్రీ చంద్రమౌళీశ్వరపూజను నిర్వహించారు.



మహాకుంభాభిషేక ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

సాయంత్రం జగద్గురు దర్శనం, వస్త్ర స్వీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులందరినీ ఆశీర్వోక్తంగా అనుగ్రహించారు. ఈ సందర్భంగా స్వామీజీ శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి సన్నిధికి వచ్చి స్వయంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహాకుంభాభిషేక నిర్వహణ కోసం ఆలయ కలశాల వద్దకు చేరుకుని ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులు, శిష్యగణంతో కలిసి ఆలయానికి విచ్చేసి కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు.

బాల పోలేరమ్మా.. దీవించవమ్మా..



అమ్మవారికి కలశాభిషేకం చేస్తున్న అర్చకుడు



ఊరేగింపుగా కలశాలను తీసుకు వస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం చిన్నచెస్తవీధి జగన్మాత శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులను కరుణించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఆ ప్రాంతంలో పూజోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజు శుక్రవారం పోలేరమ్మ తల్లి మూల మూర్తికి అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. అనంతరం రెండు, మూడు రోజులు చల్ల సమర్పణ, బోనాల సమర్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటిరోజున శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానంలో ప్రధాన కలశానికి పూజలు నిర్వహించిన అర్చకులు శిరస్సుపై ధరించి బాల పోలేరమ్మ ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల సందడి మధ్య మంగళ వాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి మూలమూర్తిని పసుపుతో అలంకరించి పలురకాల పూలతో తీర్చిదిద్ది కర్పూర హారతులను అందజేశారు. అర్చకుల వేదమంత్రోచ్చాటనల మధ్య విశేష పూజోత్సవాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : మండలంలోని చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ పార్థసారథి తెలిపారు. శుక్రవారం పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో సభలు నిర్వహించి పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులు మామిడి, చీనీ, నిమ్మ, సపోట, జామ, సీతాఫలం తదితర పంటలు సాగు చేసుకుంటే 3 ఏళ్ల పాటు సంరక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం, మొక్కలు, సంరక్షణ అన్ని మూడేళ్ల పాటు ఉచితం చేస్తామన్నారు. మరో రెండేళ్లు రైతులు ఆ పంటలను సంరక్షించుకుంటే పంట దిగుబడి వస్తుందని వివరించారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవిలో భాగంగా అందించే కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. పొడదుర్తి, లేటపల్లె గ్రామాల్లో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై కిశోరి బాలికలకు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్ లైన్, స్వీయ రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు శివారెడ్డి, అబ్దుల్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నవ ధాన్యాలు సాగు చేయాలి

కమలాపురం : రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా నవ ధాన్యాలు సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌చార్జ్ లతాకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని కోగటం గ్రామంలో వీఓ-3లో ఖరీఫ్ కార్యచరణ ప్రణాళిక-2025-26 నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ రైతులుగా ఎంపికైన శివారెడ్డి, జ్యోతి, అరుణ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 92 కిచెన్ గార్డులు, 4 ఏటీఎం మోడల్స్ ఉన్నాయన్నారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో కనీసం 100 ఏకరాల్లో నైనా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. భూమిని 365 రోజులు గ్రీన్ కవర్ చేస్తే భూమిలో కర్బన శాతం పెరిగి ప్రధాన పంట దిగుబడి రావడానికి దోహదం చేస్తుందన్నారు. ముఖ్యంగా కొబ్బరి, మామిడి, అల్లనేరేడు సాగు చేస్తున్నారని, ఇది శుభ పరిణామం అన్నారు. రైతులు ఎరువులు, పురుగు మందులు తగ్గించి కేవలం పశువుల పేడను పొలంతో అనుసంధానం చేసి నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు.

ఫిరాయింపుదార్లకు విమర్శించే హక్కు లేదు


- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జిలు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్లు, నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ పార్టీ బి.ఫారంపై గెలిచి స్వార్థ ప్రయోజనాల కోసం కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి పంచన చేరిన కార్పొరేటర్లకు తమను విమర్శించే హక్కు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జిలు అన్నారు. శుక్రవారం నగరంలోని తమ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు దాసరి శివ, జయచంద్రారెడ్డి, ఐస్‌క్రీమ్ రవి, షఫీ, సుబ్బరాయుడు, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నప్పటికీ నగర అభివృద్ధిని పట్టించుకోకుండా మేయర్‌పై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామికమన్నారు. ఎమ్మెల్యే మాధవి హామీల అమలుపై దృష్టి సారించకుండా మేయర్‌పై కక్ష సాధింపులకు పాల్పడటం విచారకరమన్నారు. తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. తమ పార్టీ ఫిరాయించిన సుబ్బారెడ్డి, సూర్యనారాయణ వంటి కొందరు కార్పొరేటర్లు చట్టం తన పని తాను చేసిందని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తమ పార్టీ బి.ఫారంపై గెలిచిన వీరికి ఏమాత్రం విలువలు ఉన్నా రాజీనామాలు చేసి ఆ తర్వాత విమర్శించాలన్నారు. వైఎస్ రాజారెడ్డి, దివంగత సీఎం వైఎస్ఆర్, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్లు చెప్పుకుని కడపలో రెండుసార్లు కార్పొరేటర్‌గా గెలిచిన సూర్యనారాయణ తమపై అనుచిత విమర్శలకు పాల్పడటం విచారకరమన్నారు. ఆయన చేస్తున్న అక్రమ వసూళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌కు ఎంత ట్యాక్స్ కడుతున్నారో అన్ని విషయాలు తమకు తెలుసన్నారు. వైఎస్ జగన్ హయాంలోనే కడప అభివృద్ధి జరిగిందంటూ ఒకప్పుడు మాట్లాడిన కార్పొరేటర్లే నేడు ఎమ్మెల్యేకు భయపడి ఆమె చెప్పిన స్క్రిప్టును పాత్రికేయుల సమావేశంలో చదువుతున్నారని ఆరోపించారు. మహానాడు కోసం కార్పొరేషన్ నిధులతో కమిషనర్ ద్వారా రంగులు వేయిస్తున్నారని ఆరోపించారు. మహాసభలకు పార్టీ నిధులను వినియోగించాలే తప్ప కార్పొరేషన్ నిధులు వాడరాదని హితవు చెప్పారు. గత నవంబరులో జరిగిన మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే మాధవీకి డయాస్‌పై సీటు వేయవద్దంటూ తొలుత లేవనెత్తింది మీరు కాదా? అంటూ ప్రశ్నించారు. కార్పొరేటర్ సూర్యనారాయణ ఆడిటోరియంను ఐదు సంవత్సరాలు ఏకధాటిగా సంపాదించుకున్నది మేయర్ దయతో కాదా? అని ప్రశ్నించారు. నెహ్రూ పార్కు, చుట్టుప్రక్కల ఉన్న బండ్ల వ్యాపారుల వద్ద డబ్బులు రాబడుతున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. డిష్ వైరు తగిలి ఒక బాలుడు మరణిస్తే భయపడి పార్టీ మారింది నువ్వు కాదా? అని నిలదీశారు. బుగ్గవంకలో కంపచెట్లు తొలగించేందుకు రూ. 3.60 కోట్ల నిధులు తీసుకుని ఇప్పటికీ టెండర్లు పిలువకుండా ఎమ్మెల్యే ఖాతా లోకి డబ్బులు వేసుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. నిజంగా కడప అభివృద్ధిని ఎమ్మెల్యే కోరుకుంటే నిజాయితీగల ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు రామలక్ష్మణ్ రెడ్డి, బసవరాజు, కిరణ్, కె.బాబు, త్యాగి తదితరులు పాల్గొన్నారు.


డెంగ్యూను అరికడదాం



మోచంపేట ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దాం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మోచంపేట, ఆర్వీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ దోమల నిర్మూలన, డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సంయుక్తంగా డెంగ్యూ నివారణలో భాగంగా పలు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని.. తద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్‌చంద్ర, కడప డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ విజయభాస్కర్, కమ్యూనిటీ మెడిసిన్ ఆఫీసర్ సయ్యద్ బాష, ఎపిడిమాలజిస్ట్ ఎస్ ఖాజామొహీద్దీన్, డెమో భారతి, డాక్టర్ అనితశ్రీ, జీ వెంకటర్‌రెడ్డి, ఏఎన్ఎం , ఆశాలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయంలో ధర్నా



వైవీయూలోని పరిపాలన భవన్ ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌బి నాయకులు

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠంలో యోగి వేమన యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల అఫిలియేషన్‌ని రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా అధ్యక్షుడు సగలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కడపలోని యోగి వేమన యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఏఐఎస్‌బి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యూనివర్సిటీ అధికారులను మోసం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఒక చోట అనుమతి ఉంటే మరొక చోట తరగతులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఆర్టీసీ బస్సు షెల్టర్, అన్నదాన సత్రంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు అని వారు ఆరోపించారు. బ్రహ్మంగారిమఠంలోని అన్నదాన సత్రంలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల నుంచి వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలాగే కళాశాలకు సెల్ఫ్ సెంటర్‌ను కూడా రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కొత్త రేషన్ కార్డుకు లేనిపోని నిబంధనలు పెట్టకుండా సరళతరం చేసి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ స్కీం కార్మికులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేటట్లు చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే.సి.బాదుల్లా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుకు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని.. అయితే ఆన్‌లైన్ కష్టాలతో పాటు లేనిపోని నిబంధనలతో సచివాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామంలో శుభ్రం చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య అన్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లావణ్య వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ దోమలు, ఈగలు,పక్షులు, జంతువుల వలన రోగాలు త్వరగా మనుషులకు వ్యాపిస్తాయన్నారు. నిలువ ఉన్న నీటి గుంటలలో, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలలో ఇవి వాటి సంతానాన్ని వ్యాప్తి చేయడం వలన ప్రజలకు రోగాలు వ్యాపి చెందుతాయన్నారు. తదనంతరం గ్రామంలోని పలు ప్రాంతాలలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బుగ్గవంకలో పూడికతీత పనులు చేపట్టాలి



సంతకాల సేకరణ చేపడుతున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర పరిధిలోని అల్మాస్ పేట బ్రిడ్జి నుండి పాలెంపల్లి బైపాస్ రింగ్ రోడ్డు మధ్యనున్న బుగ్గ వంకలో జంగిల్ క్లియరెన్స్ పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని సీపీఐ కడప నగర కార్యదర్శి యస్.వెంకట శివ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని రూకవారి పల్లె , పాలెం పల్లెలో సీపీఐ నాయకులు స్థానిక ప్రజలు, రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్మాస్ బ్రిడ్జి నుండి పాలెంపల్లి బైపాస్ రింగ్ రోడ్డు వరకు బుగ్గవంక లో ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కల పూడిక తీత పనులు చేపట్టి సుందరీకరణకు శ్రీకారం చుట్టాలన్నారు. బుగ్గ వంక సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలన్నారు. రానున్న కాలంలో బుగ్గ వంక రక్షణ గోడలు,40 అడుగుల అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు టక్కోలి మనోహర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పకీరప్ప, వీర సుబ్బారెడ్డి, నాగ సుబ్బయ్య, వెంకటరమణ, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సుంకులమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలో చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మతల్లి దశమ తిరునాల మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల ఆచార్యత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ మహా గణపతి పూజ, స్వస్తి వాచనము, పంచగవ్య ప్రాసన, ప్రోక్షణ, ఋత్విక్ కరణము, కంకణ ధారణ, ప్రధాన కలశ స్థాపన, సుంకులమ్మ దేవత పంచామృత అభిషేకములు, అమ్మవారి మూలవరులకు కుంకుమార్చన, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. కాగా సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.